
"సంధ్యా... కాఫీ..."
"అమ్మా... పాలు."
"మమ్మీ, మిల్క్."
మొగుడూ, పిల్లలూ
ఎవరి గదుల్లోనుండి
వాళ్ళు అరుస్తున్నారు.

సంధ్య కాలుకాలిన పిల్లిలా యింట్లోంచి ధిగుమ్మంలోకి, వీధి గుమ్మంలోనుండి ఇంట్లోకి తిరుగుతోంది. ఏడు దాటినా పాలవాడు రాలేదు. పాల పేకెట్లు తేలేదు. ఈవేళ వేన్ రావడం లేటయ్యిందేమో. ఎలాగబ్బా వీళ్ళెవరూ ఆగేలాలేరు. రోజూ ఫ్రిజ్‌లో ఒక పేకెట్ దాచి వుంచేది యిలాంటప్పుడు పనికొస్తుందని. కానీ క్రితం రాత్రి గెస్ట్స్ రావడంతో అది కాస్తా ఖాళీ అయిపోయింది. ప్రక్కవాళ్ళనెళ్ళి అడుగుధామంటే ఆవిడ ఇందాకటినుండి కదలడంలేదు. వాళ్ళకీ ఈ పాలవాడే అవడంతో ఎదురు చూస్తోందిలా వుంది.



ఆలోచిస్తూ మెల్లిగా బెడ్‌రూంలో కెళ్ళింది సంధ్య. "ఏవండీ! పాలవాడు రాలేదు ఇంత వరకూ- క్రిందకెళ్ళి ఎక్కడో అక్కడ పాలు తీసుకురాకూడదూ."

"ఏంటీ! పాలు రాలేదా! ఈ మాట ఇందాకటినుండి ఎందుకు చెప్పలేదూ?" అంటూమళ్ళీ ముసుగు తన్ని పడుకున్నాడు బెడ్ కాఫీ తాగే శ్రీకాంత్.

"రవీ! నువ్వైనా కాస్త క్రిందకెళ్ళి చూసి రామ్మా!" కొడుకు రవిని బ్రతిమాలుకుంది.

"ఎక్కడా దొరకవమ్మా" తడుముకోకుండా చెప్పేసేడు, యింక వెళ్ళే పనేలేనట్లు.

"ఏంటి మమ్మీ, పాలు ఇంకా రాలేదా! నే కొనుక్కురానా పోనీ. ఎక్కడ దొరుకుతాయో చెప్పు?" ఎనిమిదేళ్ళ అపర్ణ ముద్దుగా అడుగుతోంటే కూతుర్ని దగ్గరకి తీసుకుని ముద్దుపెట్టుకుంది ప్రేమగా. 'ఎంతైనా ఆడపిల్ల' అనుకుంటూ....

ఎనిమిదయింది....

పదయింది....

పాలవాడి జాడలేదు. కబురు లేదు.

ఆఫీసుల కెళ్ళేవాళ్ళు వెళ్ళిపోయేరు.

కాస్సేపటికి ప్రియా అపార్ట్‌మెంట్స్ అంతా అట్టుడికినట్టు ఉడికి పోయింది. ఆడవాళ్ళంతా గుమికూడారు. ఒకరి మాటల వల్ల ఒకరికి తేలిందేంటంటే....ఆ పాలవాడు ఎవరో, ఎక్కడి నుండి వస్తాడో, ఏ బూత్‌నుండి పాలు తెస్తాడో కూడా కనీసం ఎవ్వరికీ తెలియదని. ఎవరంతటికి వారు "ప్రక్కవాళ్ళు చెప్తే మేమూ వాడి చేతే తెప్పించుకుంటున్నాం" అన్నవాళ్ళే.

మొత్తానికి ఆ అపార్ట్‌మెంట్స్‌లో వున్న ముప్పై ఇళ్ళలో ఐదారుగురు తప్ప తక్కిన వాళ్ళందరికీ పాలు తెచ్చిచ్చేది వాడే....సంగతేంటో తెల్సుకున్న 'ఆ మిగతా ఐదుగురు మాత్రం ఆ రోజు వెలిగిపోయేరు.

'మేం అందుకే బూత్ మిల్క్ తెప్పించం. టైంకి రాదు....అదీ కాకుండా ఆ పాల వాసనే మా వాళ్ళకి పడదు' ఆరు కొట్టేసరికి ఠంచనుగా ఇంటికి తెచ్చి పోస్తాడు చిక్కటి గేదెపాలు' పదమూడో నెంబరు ఫ్లాట్ పల్లవి గీటుపోయింది.

'మా వాడు రోజూ ఐదున్నరకే వస్తాడు. ఈ రోజు ఏమైందో' సంధ్య వాపోయింది.

'మీకు ఆ రోజే చెప్పాను, పాలు విరిగిపోయేయన్నాడు....గుర్తుందా, మీరు కూడా మా పాల వాడి దగ్గరే పోయించుకోండి....నమ్మకంగా పోస్తాడు....అని....విన్నారా? ఆ మీవాడు మరీ ఆరు దాటేకా గానీ రాడు అంటూ వద్దన్నారు' ఐదో ఫ్లాట్ నెంబరు అరవింద సంధ్యని దెప్పింది.

ఆ రోజు పాలురాలేదన్న బాధకంటే అందరి మనస్సులో ఒకటే భయం....ఆ రోజు ఏడో తారీఖు....ఆ రోజునుండే క్రొత్త కార్డు మొదలు. కొంతమంది పైకి అంటే కొంతమంది లోపల అనుకుంటున్నారు....అలా యింకో రోజు గడిచింది. పాలవాడి జాడలేదు.

'అమ్మో! వీడుగానీ డబ్బులు తీసుకుని పారిపోలేదు కదా.'

'అయితే ఈ నెల రోజులూ పాలు పోయనట్లేనా?'

'ఈ నెల రోజుల డబ్బులు వదులుకోవల్సిందేనా?'

ఎవరికి తోచినట్లు వాళ్లు వ్యాఖ్యానిస్తున్నారు.


"ప్రతీ నెలా ఐదారు తారీఖులలోవచ్చిడబ్బు వసూలుచేసి తనే డబ్బు కట్టి కార్డు కూడా తనే ఉంచుకుంటోంటే ఎప్పుడూ అనుమానమైనా రాలేదు."

"యిలా ఎగేసే వాళ్ళంతా ఇలానే నమ్మించి మోసం చేస్తారు."

"కనీసం వాడి యిల్లు ఎక్కడోనైనా తెలీదు మనకి."

"యింటిదాకా ఎందుకండీ, వాడిపేరు కూడా తెలియదు మనకి."

"అవన్నీ వదిలేసినా వాడు కనీసం ఏ బూత్ నుండి పాలు తెస్తాడో కూడా తెలియదు. చుట్టుప్రక్కల రెండు మూడు చోట్ల అడిగితే అలాంటి కుర్రాడెవరూ తెలియదన్నారు."



# పరామర్శ

## కె.యస్.లత

జన్మదిన ప్రత్యేక సంచిక
కథల పోటీలో
బహుమతి పొందిన కథ

ఆ రెండు రోజులూ ప్రియా అపార్ట్‌మెంట్స్ లోనేకాక ఆ ప్రక్కనున్న చంద్రా టవర్స్‌లో కూడా రకరకాల వ్యాఖ్యానాలు గాలి దుమారంలా లేచేయి.

మొగుళ్ళని పెళ్ళాలు, పెళ్ళాళ్ళని మొగుళ్ళూ, పిల్లలని తల్లులూ, తల్లులని పిల్లలూ ఒకరి నొకరు ఆడిపోసుకున్నారు.

'అసలంత ముందూ వెనకా చూడకుండా డబ్బెలా కట్టేరు యిన్నాళ్ళు?'

"వాళ్ళు కట్టేంని వీళ్ళు, వీళ్ళకి తెల్సని వాళ్ళూ కట్టేయడమేగానీ ఒక్కరంటే ఒక్కరు ఈ కుర్రాడెవరూ, ఎక్కడి వస్తున్నాడూ, ఒక్కొక్కళ్ళం వందల్లో ఇచ్చిస్తున్నామే ప్రతి నెలా ఈ డబ్బంతా తీసుకుని ఎప్పుడైనా పరారైతే అని ఆలోచించేరా? మీ ఆడవాళ్లంతా అమ్మలక్కలం కబుర్లు చెప్పుకుంటారుగానీ, డబ్బిచ్చే ముందు ఇలాంటి వెందుకు తెల్సుకుంటారు" ఓ మొగుడు పెళ్లాన్ని దెప్పితే-

"నాకైతే పోనీ తెలియదు. ప్రతినెలా డబ్బు తీసి మీరే నాచేతికిస్తున్నారుగా వాడికిమ్మని- ఒక్కసారైనా వాడెవరో తెల్సుకుందామని ప్రయత్నంచేసేరా? యిన్నాళ్ళు లేనిది, వాడీ రోజు రాకపోయేసరికి నామీద ఎగిరిపడ్తారేంటి?" గయ్‌మంది అతని పెళ్లాం.

"మనిద్దరి టవర్స్‌లో కలిసే వాడికి కొన్ని వేలు వచ్చి వుంటాయి. వెధవ ఎత్తుకుపోయుంటాడు- ఏం బాగు పడ్తాడో యిందరి ఉసురు పోసుకుని!!"

"ఎన్నేళ్ళుగా ఎదురు చూస్తున్నాడో యిలాంటి అవకాశం కోసం."

"ఇంతమందిలో ఒక్కరికి కూడా వాడి ఆచూకీ తెలియదంటే.... మనమెంత పిచ్చివాళ్లం! ఎంత టోలా కొట్టించేడు?"

ఆ మర్నాడు- ప్రొద్దున్నే పేపరు చూస్తున్న శ్రీకాంత్ ఒక ప్రకటన చూసి సంధ్యని కేకేసేడు.

"ఇది చూసేవా-ఈ కుర్రాడుగానీ మన పాలవాడు కాదుకదా" ప్రకటన చదివి విని పిస్తూ అడిగేడు.

"ఆచూకీ తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పదో తారీఖు సాయంత్రం ఉస్మానియా జనరల్ హాస్పిటల్లో చేర్పించబడ్డాడు. అతని వయస్సు 16,20 సం॥ల మధ్య ఉండవచ్చు."

"మైగాడ్! అదెలా సంభవం? 'అదిరిపడింది.

"ఏం? ఎందుకు కాకూడదు?" శ్రీకాంత్ ఎదురు ప్రశ్న వేసేడు.

* * * *

'పాపం ఎవరో ఈ కుర్రాడు? ఇంట్లో తెలిపి కూడా ఉండదేమో! ఎవ్వరూ రాలేదు రెండ్రోజులైనా-తెలియచేద్దామన్నా అతనేం మాట్లాడగలిగే పరిస్థితి రాలేదు' అలాంటి కేసులు రోజూ వస్తూనే వున్నా అలవాటు ప్రకారం అనుకోకుండా ఉండలేకపోయింది నర్సు ప్రమీల.

## తెలుగు భరిణ

"ఈసారి తెలుగింటి ఆడబడుచులకు సరికొత్త పథకం ఏదో ప్రవేశపెడ్తానన్నారు.... అదేంటో చెప్తారా?" అడిగాడు విలేఖరి మంత్రి సన్యాసిరావుని.

"అవును...తెలుగింటి ఆడపడుచులకు ఇంటింటికీ ఓ 'తెలుగు కుంకుమ భరిణ' రేషన్ కార్డులమీద సరఫరా జరిపిస్తాం" చెప్పాడు మంత్రి సన్యాసిరావు

—ఈమని శ్రీనివాస్
(వినుకొండ)

రెండు రోజుల నుండి స్పృహ లేకుండా దిక్కూ మొక్కూలేనివాడిలా పడివున్న ఆ కుర్రాడిని వెతుక్కుంటూ ఆ రోజు వచ్చిన జనాన్ని చూసి ఆశ్చర్యపోయింది 'ఈ కుర్రాడి కోసం యింతమందా!' అనుకుంటూ—

'యిదుగో- ఈ బెడ్ మీద వున్నాడు.'

'వాడేనండీ మనవాడే- అనుమానంలేదు.'

"అమ్మయ్య! బ్రతికేం."

"అబ్బ! ఇంట్లో తిట్లు తప్పేయిబాబూ."

"నెలంతా ఎలా గడుస్తుందా అని బాధ పడ్డాను. గొడవ వదిలిపోయింది."

"నేననుకుంటూనే వున్నాను ఆ కుర్రాడు అలా పారిపోయేరకం కాదని.'

"అవునండీ- నేనూ అలానే అనుకున్నాను ఆ మొహం చూస్తే తెలియదూ ఎలాంటివాడో."

"అలాంటిదేదో అవాంతరం వచ్చి వుంటుందని నా మనస్సులో అన్పిస్తూనే వుంది."

తలా తోకాలేని వాళ్ళ సంభాషణ నర్సు ప్రమీలకేం అర్థం కాలేదు.

"ఎవరమ్మా, మీరంతా? అతనికేమౌతారు?" అని అడగకుండా వుండలేకపోయింది.

విషయం తెల్సుకున్నాక- ఒక పాలవాడి మీద ఇంత ప్రేమా? ఇంత శ్రద్ధానా? అయినింటి పెద్దాళ్ళు ఏమైనా చేస్తారు. చేయగలరు. అనుకుందేగాని వాళ్ళ రాక వెనక కథ తెల్సుకోలేకపోయింది.

"అతనిదగ్గిర ఏమైనా కాగితాలు దొరికాయా?" ప్రశ్నించేరు నర్సుని.

"లేదండీ- ఏక్సిడెంటులో రోడ్డుమీద స్పృహ లేకుండా పడివుంటే పోలీసు కేసుగా రిజిస్టరైంది. అతని అడ్రసేంటో పేరేంటో కూడా తెలియలేదు ఇంతవరకూ- మీకింకా వివరాలు కావాలంటే- మేరీ సిస్టర్ని అడగండి. ఆ రూంలో వుంటారు- ఎడ్మిట్ చేసినప్పుడు ఆ సిస్టరే డ్యూటీలో వున్నారు" చెప్పింది నర్సు.

* * * *

ఆ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికివచ్చిన శ్రీకాంత్‌కి సంధ్య సంబరంగా చెప్పింది.

"పొద్దున్న పేపర్లో చూశలేదూ! వాడు మన పాలవాడే. మేమంతా హాస్పిటల్ కెళ్ళి చూసి వచ్చేం. యాక్సిడెంట్ కేసుగా రిజిస్టరైందిట-వాడికింకా స్పృహరాలేదు. వాడి జేబులో ఒకపాలకార్డు దొరికింది. అదైనా బాగా నలిగి అవసాన దశలో వుంది. దానిమీద బూత్ నెంబరు చూసి అక్కడికెళ్ళి వివరాలన్నీ సేకరించే సరికి తలప్రాణం తోకకొచ్చింది. వాడు పాపం అందరి కార్డులూ ఏదో తారీఖునే కట్టేసుట...పిడికేమైందో ఆ బూత్ వాడికీ అర్థం కాలేదు. రెండు రోజులుగా రాకపోయే సరికి పాలు వుంచాలో, అమ్మెయ్యాలో కూడా తెలియక వాడు అవస్త పడ్తున్నాడు. ఇంతకీ మనకి పాలు ఎక్కడినుండి తెస్తున్నాడో తెలుసా? గాంధీనగర్ బూత్ నుండి. ఎక్కడి మన వెంకటేశ్వర కాలనీ, ఎక్కడి గాంధీ నగర్....అందుకే మనం వాడు ఏ బూత్ నుండి తెస్తున్నాడో కూడా, తెల్సుకోలేక పోయేం....

"అదేం....మనకు చుట్టుప్రక్కల చాలా బూత్స్ వున్నాయిగా....అంతదూరం నుండి తేవడమేం." అర్థం కాక అడిగేడు శ్రీకాంత్....

'ఆ వాడిల్లు అక్కడే ఎక్కడోట, అదీకాకుండా వాడు అక్కడ రెండు, మూడు టవర్స్‌లో చిన్నప్పటినుండీ యిస్తున్నాడట. అవి వదులుకోలేక....తలొక బూత్‌లో ఒక్కడే పాళ్లు కలెక్ట్ చేసుకోవడం కష్టమని మనవీ అక్కడే కట్టేస్తున్నాడనీ....వాడు చెప్పేడు....'

'మొత్తానికి మీ మహిళా మండల విజయం సాధించిందంటావు?'....మెచ్చుకోలుగా అన్నాడు శ్రీకాంత్.

'మరి...మహిళామండలా, మజాకానా?....ఏమనుకొన్నారు మేమంటే....?' గర్వంగా అంది సంధ్య.

ఆ సంభాషణ చాలాసేపట్నుంచీ వింటున్న రవి తల్లి చేతిమీద తడుతూ అడిగాడు-"మమ్మీ ఇంతకూ పాపం ఆ అబ్బాయికెలా వుంది? ఎవరు చూస్తున్నారతన్ని?"

ఒక క్షణం—

హృదయంలో ఎక్కడో కలుక్కుమంది సంధ్యకు. ఎప్పుడూ కలగని, ఏమిటో తెలియని బాధ కలిగింది గుండె లోతుల్లో. పాలిపోయిన ముఖంతో బలవంతంగా కళ్లెత్తి భర్త వదనంలోకి చూసింది.

అతని పరిస్థితీ అంతే. ముఖంలో రక్తం వెలాతెలాబోతోంది.

తల వంచుకున్నాడు భార్యను, కొడుకునూ కళ్ళలోకి చూడలేక.

అపర్ణ గొంతు వినిపిస్తోంది వారికి—

"మరీ డాడీ, మనం ఫ్లాట్స్ వాళ్ళందరి దగ్గర డబ్బులు కలెక్ట్‌చేసి పాలబ్బాయిని మంచి డాక్టరుకి చూపిద్దామా?"